ఆర్టీసీ ద్వారా ఇంటివద్దకే సీతారాముల తలంబ్రాలు

ఫతేనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం తలంబ్రాలు డోర్ డెలివరీ చేసేందుకు టీఎస్‌ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత, డిపో డీఎం ఇసాక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాలకు సంబంధించిన పోస్టర్‌ను డిపోలో ఆవిష్కరించారు. తలంబ్రాలు కావలసిన వారు కూకట్‌పల్లి బస్టాండులోని ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రంలో రూ.151 చెల్లించి ఈనెల 18వ తేదీలోపు బుక్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం కూకట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ జంపన్నను సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 91542 98824, 91542 98839లో సంప్రదించాలని వారు తెలిపారు.



దీపాదాస్‌మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కాంగ్రెస్‌లో చేరిన నిజాంపేట్ కార్పొరేటర్లు

నిజాంపేట్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13, 14 డివిజన్‌ల బీఆర్ఎస్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, యువ నాయకులు ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీ సమక్షంలో ఫిలింనగర్‌లోని ఆమె నివాసంలో గురువారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరిని మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి ఆధ్వర్యంలో 13, 14వ డివిజన్‌ల కార్పొరేటర్‌లు ఆవుల పావని జగన్‌యాదవ్, కర్నేటి రాజేశ్వరి వెంగయ్య చౌదరిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాల వెంగయ్య చౌదరి, నాగరాజుయాదవ్, మహేందర్‌రెడ్డిలు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ముందుంటాం

దుండిగల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటామని బాచుపల్లి కౌసల్యాకాలనీ, 17వ డివిజన్ కేఎస్ఆర్ సభ్యులు అన్నారు. బాచుపల్లిలోని వేంకటేశ్వర శివ రామాలయానికి కేఎస్ఆర్ సభ్యులు శ్రీనివాసరావు, కాటేపల్లి ఫణి, రామ్‌ప్రసాద్, సత్యప్రసాద్‌లు 25 వేలా 116 రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు.

రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు

భెల్‌కాలనీ ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీహెచ్ఇఎల్ ఎంఐజీకాలనీలోని రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. గురువారం సీతారాములకు నిత్యపూజలతో పాటు విశేష పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అభిషేకం నిర్వహించారు. మూల విగ్రహాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి కల్యాణ మండపంలో సాయంత్రం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామంలోని వేంకటేశ్వర శివవీరాంజనేయ ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి భక్తులు, నాయకులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, కృష్ణారావు, బీరప్ప, రాఘవేంద్రరావు, బాలప్ప, దేవేందర్, గోపాలచారి, శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.



అలివేలు మంగ పద్మావతి వేంకటేశ్వరస్వామి



కేఎం ప్రతాప్‌గౌడ్‌ను కలిసిన పట్నం మహేందర్‌రెడ్డి

ఎంపీగా సునితామహేందర్‌రెడ్డిని గెలిపించాలి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్‌ను కోరారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ప్రతాప్‌గౌడ్ నివాసంలో మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం మహేందర్‌ని కేఎం ప్రతాప్, నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్, కాలనీ, బస్తీల నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బాలిక బంధువులు

స్ఫూర్తి ఫౌండేషన్ ఎదుట ఆందోళన

దుండిగల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దుండిగల్‌లోని స్ఫూర్తి ఫౌండేషన్ ఎదుట మృతురాలు బాలిక బంధువులు గురువారం ఆందోళన నిర్వహించారు. సూరారానికి చెందిన నీలం సతీష్ కుమార్తె(11) స్ఫూర్తి ఫౌండేషన్ వసతి గృహంలో ఈనెల 8వ తేదీన అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో బాలిక మృతికి ఫౌండేషన్ వారే బాధ్యులంటూ బంధువులు నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని ఫౌండేషన్ సభ్యులు దుండిగల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న బాలిక బంధువులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

బీజేపీ జిల్లా కోకన్వీనర్‌గా యంజాల పద్మయ్య

కూకట్‌పల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మేడ్చల్ జిల్లా కో కన్వీనర్‌గా కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకుడు యంజాల పద్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బీజేపీ అభివృద్ధికి పాటుపడడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పద్మయ్య తెలిపారు.



పద్మయ్య

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా కృష్ణాగౌడ్

ఫతేనగర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ప్రోగ్రాం కో - ఆర్డినేటర్‌గా ఫతేనగర్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు ముద్దాపురం కృష్ణాగౌడ్ నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ కృష్ణగౌడ్‌కు ఫ్యాక్స్ ద్వారా గురువారం పంపించారు.



ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్

పేట్‌బషీరాబాద్: ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రంగా రెడ్డినగర్ డివిజన్, గాంధీనగర్ ప్రాంతానికి చెందిన మేడ్చల్ గీతామోర్చా, కార్యనిర్వాహకులు రంగా శ్రీనివాస్‌గౌడ్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీకి కార్యకర్త స్థాయి నుంచి అంకితభావంతో పని చేసినందుకు తన సేవను గుర్తించి ఈ బాధ్యతలను అప్పజెప్పారన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించినందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకత్వానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఆదిత్యనగర్ ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



హైదర్‌నగర్ ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



హబీబ్‌నగర్‌లో ముస్లిం నాయకులతో కలిసి వేడుకల్లో మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు

ఘనంగా రంజాన్ వేడుకలు

జోన్‌బృందం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను గురువారం కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, మూసాపేట, గాజులరామారం, బీహెచ్ఈఎల్, హైదర్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గల ఈద్గాల్లో ముస్లింలు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



రాజీవ్‌గృహకల్పలో నిర్వహించిన రంజాన్ విందులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



ఆదిత్యనగర్ ఈద్గాలో ముస్లింలతో ప్రార్థనలు చేస్తున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



గాజులరామారంలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి



చిన్నభాష ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మైనారిటీ నాయకులతో కలిసి పాల్గొన్న బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, శేరి సతీష్‌రెడ్డి, కర్క పెంటయ్య



బాలానగర్ ఫిరోజ్‌గూడకు చెందిన మైనారిటీ నాయకుడు షేక్ అబ్దుల్ రహీం ఏర్పాటు చేసిన విందుకు హాజరైన కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి తదితరులు



ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



ఎన్ఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీమ్, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, సీనియర్ నాయకులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు

సేవ చేసుకునే అవకాశం ఇవ్వండి: రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

హైదర్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకాందనగర్, కూకట్‌పల్లి డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశంలో టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. అనంతరం జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నేరవేరుస్తుందనీ తెలిపారు. అందరం రంజిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

దాహార్తిని తీర్చుతున్న చలివేంద్రాలు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్‌లో డాక్టర్ బండారి ఉమారాణి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ బి.విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సాయికుమార్, జీవన్‌కుమార్, కిరణ్, మనోజ్, భారతి, సరళ, స్థానిక నాయకులు లక్ష్మీనాథ్, ఖాధర్, బాల్ పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం'

గాజులరామారం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలు సంక్షేమ సంఘం సభ్యులు ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పలు బస్తీలో నెలకొన్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, గుంజ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భెల్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

జ్యోతీరావు పూలేకు ఘననివాళి

(జోన్ బృందం, ఆంధ్రజ్యోతి)

మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలోని పలు కాలనీలు, బస్తీల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పూలే విశేష కృషి చేశారన్నారు.



మహాత్మా జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్, సర్కిల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉప కమిషనర్ వి.నర్సింహ, ఏఎంసీ కృష్ణ, ఏఈఈ మల్లారెడ్డి, అధికారులు, సిబ్బంది



జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, అధికారులు

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సిమెంట్ లారీ

- ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు

జీడిమెట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగిన ఓ లారీ డ్రైవర్ అతివేగంతో నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల బస్సు డిపో వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. డ్రైవర్ బాలాజీ సిమెంట్ లోడుతో ఉన్న లారీతో జీడిమెట్ల వైపునకు వెళ్తున్నాడు. అదే సమయంలో లారీ ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. బస్సు స్వల్పంగా దెబ్బతింది. బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు లారీ డ్రైవర్ బాలాజీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదనే మనస్తాపంతో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో 40 రోజులు పాటు చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, కంకోలు గ్రామానికి చెందిన మంగలి సురేష్(29) బతుకుదెరువు కోసం భార్య స్వప్నతో కలిసి నగరానికి వచ్చి గాజులరామారం ప్రాంతంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. తిరిగిరాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సురేష్ గత ఫిబ్రవరి 26వ తేదిన తాగిన మైకంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి మంటలార్పి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సురేష్ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోదీతోనే మహిళా సాధికారిత

కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డి

రాయదుర్గం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి కోసం నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి టెలికాంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని పార్లమెంట్ ఎన్నికల్లో విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

- ప్రజల సహకారంతో బీజేపీ జెండా ఎగురవేస్తాం

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాదయాత్రలో భాగంగా గురువారం చేవెళ్ల మండలంలోని పామెన, కందవాడ, పలుగుట్ట, ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగా గెలిపించిన వెంటనే ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఆరుగ్యారెంటీల పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం, సంక్షేమ పథకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మొయినాబాద్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజాఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం మొయినాబాద్ మండలంలోని నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ పర్యటించారు.